లక్ష్మీనరసింహుడికి సుప్రభాత సేవ

యాదగిరిగుట్ట, మార్చి 12 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామికి సుప్రభాత సేవోత్సవం అత్యంత వైభవంగా సాగింది. మంగళవారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతాన్ని ఆలకించి స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం, క్యూ కాంప్లెక్స్, శివాలయం చెంతన గల క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి ఆకుపూజను ఘనంగా నిర్వహించారు. హనుమంతుడిని సింధూరంతో అలంకరించి అభిషేకించారు. తమలపాకులతో అర్చించి లలితా పారాయణం చేశారు. ఆంజనేయస్వామికి ఇష్టమైన వడపప్పు, బెల్లం, అరటి పండ్లను నైవేద్యంగా సమర్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 10వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.24,14,440 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం అందలే..

● బంగారు రథం దాత వంటేరు సురేశ్‌రెడ్డి ఆవేదన

వంటేరు సురేశ్‌రెడ్డి

యాదగిరిగుట్ట, మార్చి 12 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో దాతలను ఆలయ అధికారులు విస్మరించారు. వారికి ఆహ్వానం ఇవ్వకుండా అవమానపరిచారు. ఏటా బ్రహ్మోత్సవాల్లో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామికి బంగారు ఆభరణాలు, రథం, విమాన గోపురం స్వర్ణతాపడానికి భారీ నగదు, విరాళాలు అందజేసే దాతలకు ఆహ్వాన పత్రిక అందజేసి గౌరవంగా ఆహ్వానించే అనవాయితీ ఉండేది. కానీ.. ఈ ఏడాది ఆ విషయాన్ని ఆలయ అధికారులు మర్చిపోయారని దాతలు ఆవేదన చెందుతున్నారు. 2022 వార్షిక బ్రహ్మోత్సవాల సమయంలో శ్రీలోగిళ్లు డెవలపర్స్, ల్యాండ్ మార్క్ సంయుక్తంగా రూ.70 లక్షల విలువ చేసే బంగారు రథాన్ని బహూకరించారు. ఈ రథాన్ని రథసప్తమి, బ్రహ్మోత్సవాల సమయంలో స్వామివారి ఊరేగింపునకు వినియోగిస్తున్నారు. స్వామివారి ఆలయ అభివృద్ధికి తమ వంతుగా విరాళాలు అందజేస్తుంటే తమకు ఆలయ అధికారులు కనీస గౌరవం ఇవ్వడం లేదని బంగారు రథం దాత, శ్రీలోగిళ్లు డెవలపర్స్ డైరెక్టర్ వంటేరు సురేశ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనా, 18న స్వామివారి తిరుకల్యాణ మహోత్సవంలో దాతలకు ప్రత్యేక లాబీలు ఏర్పాటు చేసినా.. ఇప్పటి వరకు తమకు సమాచారం లేదని అన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

అంకుర్పాణ పూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతి బిక్కవోలు కేశవాచార్య దైవజ్ఞశర్మ

వేంకటేశ్వరుడి ఆలయంలో ప్రాణ ప్రతిష్ఠ పూజలు

రాజాపేట, మార్చి 12 : మండలంలోని రేణికుంట గ్రామ శివారులో రెయిన్‌బో డెవలపర్స్ ఆధ్వర్యంలో నిర్మించిన సంకల్ప సిద్ధి వేంకటేశ్వరాలయంలో మంగళవారం ప్రాణ ప్రతిష్ఠ పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పీఠాధిపతులు శ్రీమాన్ బిక్కవోలు కేశవాచార్య దైవజ్ఞశర్మ, శ్రీమాన్ బీవీఆర్‌బీజీర్‌కే గౌతమ్ కృష్ణ ఆధ్వర్యంలో అంకురార్పణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు బద్రీనాథ్, ఎల్లారెడ్డి, నాగిరెడ్డి, రాఘవేంద్ర, శ్రీనివాస్‌రావు, నరేశ్, భక్తులు పాల్గొన్నారు.

రైతు నేస్తంపై వీడియో కాన్ఫరెన్స్

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వ్యవసాయ అధికారులు, రైతులు

రాజాపేట, మార్చి 12 : మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మామిడి తోటల సమగ్ర సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ మాధవి, ఏఈఓలు ప్రణీత, భవ్య, అంజయ్య, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

భువనగిరి కలెక్టరేట్, మార్చి 12 : పట్టణ పరిధి మాసుకుంటలో గత నెల 20న ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. రూరల్ పోలీసులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. మాసుకుంటకు చెందిన దుబ్బాసి విజయ్ (32) గత నెల 20న సాయంత్రం హైదరాబాదులో టెంపరరీ డ్రైవింగ్ ఉన్నదని, మూడు రోజులకు వస్తానని భార్యకు చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మూడు రోజుల తర్వాత తిరిగి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తుండటంతో కుటుంబ సభ్యులు గ్రామ పరిసరాలు, బంధువుల ఇండ్లల్లో వెతికారు. విజయ్ తమ్ముడు అజయ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ వి.సంతోష్‌కుమార్ తెలిపారు. విజయ్ తెలుపు రంగుతో 5 అడుగుల 7 అంగుళాల ఎత్తు కలిగి ఉన్నాడని, ఇంట్లో నుంచి వెళ్లేటప్పుడు నీలం రంగు జీన్స్ ప్యాంట్, నీలం రంగు గీతల షర్ట్ ధరించాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు భువనగిరి రూరల్ ఎస్ఐ 8712662472, రూరల్ పోలీస్‌స్టేషన్ 8712662733 నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా

● ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య


వస్తాకొండూర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

గుండాల, మార్చి 12 : నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని, గుండాల మండలానికి తాగు, సాగుజలాలు అందించేందుకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని బండకొత్తపల్లి, వస్తాకొండూర్, పెద్దపడిశాల, తుర్కలశాపురం, అంబాల, నూనెగూడెం, మరిపడిగ, సీతారాంపురం, వెల్మజాల, అనంతారం గ్రామాల్లో రూ.1.60 కోట్ల సీసీ రోడ్ల పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు.

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు అమలు చేసి ప్రజలకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తాండ్ర అమరావతి, వైస్ ఎంపీపీ మహేశ్వరం మహేందర్‌రెడ్డి, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు ఎండీ షర్ఫొద్దీన్, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ ఖలీల్, ఎంపీటీసీ కొర్న నరేశ్, తాసీల్దార్ జలకుమారి, పీఆర్ ఏఈ దామోదర్, ఐబీ ఏఈ పరమేశ్వర్, ఏఓ లావణ్య, పశు వైద్యాధికారి ప్రత్యూష, పీఏసీఎస్ చైర్మన్ లింగాల భిక్షం, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, యాదగిరి, యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు నిరంతర కృషి

● మున్సిపల్ చైర్‌పర్సన్ కవిత

మోత్కూరు, మార్చి 12 : మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పన కోసం నిరంతరం కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత అన్నారు. పట్టణంలోని పదో వార్డులో రూ.2.50లక్షలతో చేపట్టే మట్టి రోడ్డు పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పన కోసం రూ.30లక్షలు కేటాయించినట్లు తెలిపారు. వాటితో తాగునీరు, మురుగు కాల్వల పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బొడ్డుపల్లి కళ్యాణ్ చక్రవర్తి, కూరెళ్ల కుమారస్వామి, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పదో వార్డులో మట్టి రోడ్డు పనులను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ కవిత

చైన్ స్నాచర్‌కు జైలు

చౌటుప్పల్, మార్చి 12 : బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. సంస్థాన్ నారాయణపురం మండలం కొతులాపురం గ్రామానికి చెందిన పొట్ట వెంకటేశం ఈ నెల 7న చౌటుప్పల్‌లో బంధువుల ఫంక్షన్‌కు వెళ్లాడు. తిరిగి వస్తుండగా అతని మెడలోని 2తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగుడు లాక్కెళ్లాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సూర్యాపేట జిల్లా రాజ్యనాయక్ తండాకు చెందిన హర్కావత్ వెంకన్నను నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి గొలుసును స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరిచారు. కోర్టు ఆదేశాల మేరకు నల్లగొండ జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు. కాగా, వెంకన్న కొంతకాలంగా వంట మాస్టర్‌గా పని చేస్తూ చౌటుప్పల్ పట్టణంలోని బంగారిగడ్డ కాలనీలో నివాసముంటున్నట్లు పోలీసులు గుర్తించారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలి

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి

భువనగిరి అర్బన్, మార్చి 12 : పదో తరగతి విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో చదివి ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని విద్యానగర్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే విద్యార్థి దశ కీలకమన్నారు. విద్యార్థి దశలో నేర్చుకున్న విద్య ఉన్నత స్థాయికి చేరుకోవడంతోపాటు జీవితంలో మంచి గుణపాఠాలు నేర్పుతుందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వనం రాజు, ప్రెసిడెన్సీ విద్యా సంస్థల చైర్‌పర్సన్ తీగల జయలక్ష్మి, ఉపాధ్యాయులు శివాని, రంగయ్య పాల్గొన్నారు.

మొక్కల రక్షణకు చర్యలు చేపట్టాలి : ఎంపీడీఓ

ఆలేరు రూరల్, మార్చి 12 : మొక్కల రక్షణకు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ సత్యానంద్ ప్రసాద్ అన్నారు. మండలంలోని కందిగడ్డతండాలో మంగళవారం నర్సరీని పరిశీలించి మాట్లాడారు. ఎండాకాలంలో మొక్కల రక్షణకు షేడ్‌నెట్లు ఏర్పాటు చేయాలన్నారు. మొక్కలు ఎండిపోకుండా నిత్యం నీళ్లు పెట్టాలని వన సంరక్షకులను ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సర్వర్‌నాయక్ ఉన్నారు.

బస్వాపురంలో అభివృద్ధి పనుల ప్రారంభం

బస్వాపురంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ నిర్మల

భువనగిరి కలెక్టరేట్, మార్చి 12 : మండలంలోని బస్వాపురం గ్రామంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ నిధులతో నిర్మించే బీసీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి ఎంపీపీ నరాల నిర్మల మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు రాసాల బాలరాజు, పెద్ద గొల్ల ఎర్రబోయిన బుచ్చయ్య, మాజీ వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

ఆత్మకూరు(ఎం), మార్చి 12 : మండల కేంద్రంతోపాటు కొరటికల్, పల్లెపహాడ్, ఉప్పలపహాడ్ గ్రామాల్లో మంగళవారం ఉపాధి హామీ కూలీలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నిరంజన్ వలీ మాట్లాడుతూ ఓటర్లందరూ చైతన్యంగా ఉండి నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. మన ఓటు, మన బాధ్యత అని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ రమేశ్, ఈసీ శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉమలత, సత్యనారాయణ పాల్గొన్నారు.

కొరటికల్‌లో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ నిరంజన్ వలీ

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సీసీ పనులను ప్రారంభిస్తున్న తాసీల్దార్ కృష్ణ, ప్రత్యేకాధికారి

సంస్థాన్ నారాయణపురం, మార్చి 12 : మండలంలోని గుడిమల్కాపురంలో ఉపాధి హామీ నిధులు రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను తాసీల్దార్ కృష్ణతో కలిసి ప్రత్యేకాధికారి గీతా మాధురి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఏపూరి సతీశ్, నాయకులు బాలకృష్ణ, నర్సింహ, ఇంద్రసేనారెడ్డి, లింగస్వామి, ధన్‌రాజ్ గౌడ్, కిషన్‌నాయక్, ప్రముఖ్‌రెడ్డి పాల్గొన్నారు.

రాఘవాపురంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

గ్రామాల్లో మెరుగవుతున్న అంతర్గత రహదారులు

● ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్, మార్చి 12 : గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణంతో అంతర్గత రహదారులు బాగుపడుతున్నాయని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెంకిర్యాల, రాఘవాపురం, బ్రాహ్మణపల్లి, చిన్న రావులపల్లి, జంపల్లి, బీబీనగర్, గూడూరు, నెమరుగోముల, జియాపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను మంగళవారం ప్రారంభించారు. అలాగే కొత్తగా నిర్మించే రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్ల నిర్మాణంతో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని, ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని అన్నారు. అనంతరం భువనగిరి మండలం హనుమాపురం గ్రామానికి చెందిన సత్తయ్య చికిత్స కోసం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.5 లక్షల చెక్కును ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ యర్కల సుధాకర్‌గౌడ్, జడ్పీటీసీ గోలి ప్రణీ తాపింగళ్‌రెడ్డి, నాయకులు పొటోళ్ల శ్యామ్ గౌడ్, గడ్డం బాల్‌రెడ్డి, గడ్డం బాలకృష్ణ, సురకంటి సత్తిరెడ్డి, చెరుకు అచ్చయ్య, గండు బసవయ్య, సందిగారి బసవయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువాలి

● జడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్

తుర్కపల్లి, మార్చి 12 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా ఎదుగాలని జడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్, ఎంపీపీ భూక్యా సుశీలారవీందర్ అన్నారు. మండలంలోని మాదాపురం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణ, నోడల్ అధికారి మాలతి, జిల్లా సెక్టోరియల్ అధికారులు శ్రీహరి, పెసరు లింగారెడ్డి, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ యాట పోషమణి, మాజీ ఉప సర్పంచ్ రాజు, ఎస్ఎంసీ మాజీ చైర్మన్లు మహేశ్, యాదగిరి పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న పశు వైద్యాధికారి చంద్రారెడ్డి

వ్యవసాయ అనుబంధ పరిశ్రమలతో ఆర్థిక స్థిరత్వం

బొమ్మలరామారం, మార్చి 12 : గ్రామీణ యువత ఆర్థికంగా స్థిరపడాలంటే వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు ప్రాధాన్యత ఇవ్వాలని మండల పశు వైద్యాధికారి చంద్రారెడ్డి అన్నారు. మండలంలోని మల్యాల గ్రామ రైతు వేదికలో గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణలో భాగంగా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పెరటికోళ్ల పెంపకం, పాడి పశువుల పోషణ, యాజమాన్య పద్ధతులు మరియు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో యాదగిరిగుట్ట వ్యవసాయ సంచాలకులు పద్మావతి, ఏఓ పద్మ, పశు వైద్యాధికారి సునీత పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న జడ్పీటీసీ గోపాల్‌గౌడ్

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

రాజాపేట, మార్చి 12 : మండలంలోని రఘునాథపురంలో జడ్పీ నిధులు రూ.9 లక్షలతో చేపట్టే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు జడ్పీటీసీ చామకూర గోపాల్‌గౌడ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బుడిగె రేణుక, మాజీ సర్పంచులు గాడిపల్లి శ్రవణ్‌కుమార్, రామిండ్ల నరేందర్, నాయకులు కొండం రాజు, బోగ రాజు, కటకం వెంకటేశం, చిన్న వెంకటేశం, రమేశ్ పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్లను బహిర్గతం చేయాలి : సీపీఎం

మోత్కూరులో ఎస్‌బీఐ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

మోత్కూరు, మార్చి 12 : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎస్‌బీఐ ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మోత్కూరు ఎస్‌బీఐ బ్రాంచి ఎదుట నిరసన తెలిపారు. అనంతరం బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల వ్యవస్థను, రాజ్యాంగ విలువలను దిగజార్చే విధంగా ప్రధాని మోదీ ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. దేశంలో కార్పొరేట్ సంస్థల యజమానుల నుంచి లక్షల కోట్ల ప్రజాధనాన్ని బాండ్ల ద్వారా ప్రతి ఏటా తీసుకుంటుందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, నాయకులు ప్రభాకర్, ముత్తమ్మ, లక్ష్మి, గంగయ్య, రాములు, స్వాతి పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లి : దోతిగూడెంలో ఎండిన వరి పైరును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఎకరాకు రూ.30వేల నష్ట పరిహారం ఇవ్వాలి : సీపీఎం

భూదాన్ పోచంపల్లి, మార్చి 12 : ఎండిన పంటలకు ఎకరానికి రూ.30వేల నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని దోతిగూడెం, అంతమ్మగూడెం గ్రామాల్లో ఎండిన వరి పొలాలను రైతులతో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోతిగూడెం, అంతమ్మగూడెం, జిబ్లక్‌పల్లి గ్రామాల్లో సుమారు 300కు పైగా ఎకరాల్లో వరి పంట ఎండిపోయిందన్నారు. ప్రభుత్వ అధికారులు పొలాలను పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి పగిళ్ల లింగారెడ్డి, నాయకులు గూడూరు అంజిరెడ్డి, రామచంద్రారెడ్డి, విష్ణు, మధు, బుచ్చిరెడ్డి, సత్తయ్య, రైతులు పాల్గొన్నారు.

పంటలు ఎండిపోయిన రైతులను ఆదుకోవాలి

ఆత్మకూరు(ఎం) : పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తాసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి వేముల భిక్షం మాట్లాడుతూ పంట పొలాలు ఎండిపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. నాయకులు రచ్చ గోవర్ధన్, రాములు, సత్యనారాయణరెడ్డి, నర్సింహ, మత్స్యగిరి, యాదిరెడ్డి, పుష్పమ్మ, వీరమ్మ, మల్లయ్య, కుమార్ పాల్గొన్నారు.

రామన్నపేటను కరువు మండలంగా ప్రకటించాలి

రామన్నపేట : మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జెల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం కోరారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తాసీల్దార్ లాల్‌బహదూర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి బోయిని ఆనంద్, వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, నాయకులు బల్గూరి అంజయ్య, నరేందర్, నగేశ్, హనుమంతు, బాలరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలి

రాజాపేట : పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా నాయకుడు మంగ నర్సింహులు అన్నారు. తాసీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం తాసీల్దార్ దామోదర్‌కు వినతి పత్రం అందజేశారు. ఎండిన పంటలను పరిశీలించి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు పోశెట్టి, శ్రీనివాస్, రాంచందర్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : తాసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

రాజాపేట : తాసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, రైతులు

గీత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నిక

భువనగిరి అర్బన్ : భువనగిరి పట్టణ లక్ష్మీనర్సింహస్వామి గీత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. అధికారులు కె.దశరథ, ఎస్.రామచంద్రయ్య పర్యవేక్షణలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సూదగాని ఆంజనేయులు ఉపాధ్యక్షుడిగా జడల జనార్దన్, కార్యదర్శిగా వాసగోని మణికుమార్, డైరెక్టర్లుగా రాయగోని అమరేందర్, ఊట్నూరు శశికాంత్, సూదగాని నరేశ్, దుర్గపతి శ్రీనివాస్, డొంకెన వెంకటేశం, మాటూరి భిక్షపతి ఎన్నికయ్యారు.

దళితులపై కాంగ్రెస్ చిన్నచూపు

● బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

యాదగిరిగుట్ట, మార్చి 12 : దళితులు, బీసీలంటే కాంగ్రెస్ పార్టీకి ఎప్పుడూ చిన్న చూపేనని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య అన్నారు. యాదగిరిగుట్టలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. యాదగిరిగుట్ట దేవస్థానంలో సోమవారం జరిగిన వార్షిక బ్రహ్మోత్సవాల్లో దళిత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బీసీ నాయకురాలు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను చిన్న పీటలపై కూర్చోబెట్టి అవమానపరిచారన్నారు. ఇంతటి అవమానం జరిగినా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. దేవస్థానంలో పెండింగ్ పనులను ఎప్పుడు పూర్తి చేస్తారో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పలేకపోయారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎస్సీ, ఎస్టీ, బీసీలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.